
# మూషికాలూ - శేషగిరీ



"ఏమండోయ్!" - భార్య సరోజ కేక.

"—" భర్త శేషగిరి మౌనం.

"ఇదిగోనండీ -"

చేయి చాపాడు శేషగిరి.

"ఏమిటది?" అంది ఆవిడ ఆశ్చర్యంతో.

"నీవు 'ఇదుగోనండీ' అంటే ఏదో ఇస్తున్నావు కాబోలనుకుని చేయిజాస్తున్నా!"

"బ్రాగుంది సరసం! మీతో ఒకవిషయం చెప్పాలని నేననుకుంటుంటే, మీరిలాంటి చిల్లర వేషాలు వేస్తారేం?"

"అశ్చే! చిల్లరవిగానీ టోకువిగానీ - మరి వేషాలు వేయడం మానేస్తాగాని నీవు ఆ విషయమేమిటో వినిపించు."

"ఇదుగో - ఈ ఇంట్లో ఈ బాధ నేను ఇంతకాలం నుండిఎలాఓర్చుకున్నానో గాని, మరి భరించలేనుసుమండీ -".

"ఇదుగో ఇదుగో .... సరోజా......! ఎంత మాటను ఎంతచులాగ్గా అనేశావ్! సాధ్యమయినంతవరకూ, నా ఆర్థికప్రపంచపు సరిహద్దును అతిక్రమించిఅయినాసరే నీ ముఖం వంకర కాకుండా వుండడానికి - నా ఇంటి కలకంఠి కంట కన్నీ రొలుకకుండా వుండడానికి ప్రయత్నిస్తూ నేకదా వున్నాను?"

"అబ్బబ్బ! మీరేదో చేశారనీ, చేయలేదనీ, చెప్పడానికి రాలేదండీ!..."

శేషగిరి కొంత ప్రాణవాయువు పీల్చగలిగాడు.

..."ఈఇంట్లో ఆ ఎలుకలు పెడుతున్న ఇక్కట్లు భరించలేనండీ!...మనుష్యులుతిని నాశనంచేయడం చాలదన్నట్లు ఎలుకలు వేరా మనకి?"

'మనుష్యులు' అని భార్యారూపమయిన శత్రువు సరోజ సూచించింది తన మనుష్యుల నేనని' శేషగిరికి తెలుసు. కానీ శాంతికాముడు కావడంమూలాన్ని తెలుసుకోవడంతో ఊరుకున్నాడు. నెలలతరబడి 'దాని' బంధువులొచ్చి తిష్ఠ వేసినప్పుడెల్లా వారు ఉత్తవాయుభక్షణం చేస్తారన్నది సరోజ సిద్ధాంతం కాబోలనుకున్నాడు.

అయినా సరోజఎదుట నిలబడి శేషగిరి ఈమాట అనగలడా? అలా అనగలిగే ధైర్యమే అతనికివుంటే ఇంగ్లాండును ఆరో హెన్రీ స్థానే మన మూడుసింహాలమార్కు 'అశోకుడు' పాలించివుండును!

"సరో! నామట్టుకు నేనేదయినా తప్పు చేసివుంటే శిక్షించు. అందుకు సిద్ధం...ఎల

కలూ, సాలీళ్లు, దోమలూ నల్లులూ - ఇవన్నీ చేసేపనులకి నేనా బాధ్యుణ్ణి? ... నేనేం క్రిమికీటకమహాసామ్రాజ్యానికి అధిపతి ననుకున్నావా, వాటిరాకను నిషేధించడానికి?" అన్నాడు శేషగిరి.

"చాలుచాలండీ మీ తెలివి...అసలు... మీరు చేయాల్సింది 'ఏమిటి' అంటే ఎలుకలు పట్టడం - అంతే - తెలిసిందా?"

"ఏమిటీ? ఎలుకలు పట్టడమా? నేనా? మంచి ఆలోచనే!... నేను పట్టేటప్పుడూ ఎలుకలు ఊరుకుంటాయా? మితిమించిన ఆక్రోశంతో అవి, మీదికుఱికి కరిస్తే బాధ పడేది ఎవరనుకున్నావ్..?" అని అంటుండగానే గౌరీశిఖరంమీద వున్న దుస్తులు లేనట్టు వణికింది శేషగిరి పాంచభౌతిక దేహం... "ఏదో నేను నాలుగు కథలురాసి పత్రికలకు పంపుతూ, అవి వెనక్కి వస్తాయా లేదా అని ఎదురుచూస్తో కూచోడం నీకంటి కింపుగా లేదా? ఇంత కల్పనాశక్తి కలవాణ్ణి, భూదేవితో సమానమయిన ఓర్పుకలవాణ్ణి, రోజూ ఒక భూకంపానికి తట్టుకుంటున్నవాణ్ణి - నన్ను - కేవలం ఒక ఎలుకలు పట్టేవాడికింద తేల్చేశావే?" అని ఏదేదో అర్థంలేకుండా మాటాడేడు శేషగిరి.

"ఉస్... రామచంద్రప్రభో! మీరెపుడూ ఇంతేకదా?... ఏదో వెకిలిగా మాటాడుతూ వుంటారు. ఇప్పుడు మీ చేతుల్లో ఎలుకలు పట్టమని ఎవరన్నారండీ?"

"మరి నేను నా చేతుల్తో కాక మరొకరి చేతుల్తో ఎలా పడతాను?"

"అబ్బబ్బ... మీరు నన్ను సాంతం చెప్పనీరుకదా?... ఎలుక బోను తీసుకొచ్చి పట్టమన్నాను. తెలిసిందా ఇప్పుడు?"

"హమ్మయ్య... ఇదా విషయం? ఎలక్షన్ మీటింగులో అభ్యర్థి ఓటడిగినట్టు - దీనికింత పెద్ద తొలిపలుకా? ఇంత విశాలమయిన పీఠికా?" అన్న శేషగిరి ఆరోజు సాయంత్రమే ఒక ఎలుకలబోను తెస్తానని వాగ్దానం చేశాడు.

ఇంట్లో ఎలుకలబాధ 38 వ అక్షాంశ రేఖను దాటివుండడం శేషగిరి ఎరుగును. ఒకరోజు కుర్చీలో కూర్చుని ఏదో ఆలోచిస్తుంటే ఒక మూలనుండి ఒక ఎలుకా మరో ప్రక్కనుండి అంతకన్నా చిన్నది మరో ఎలుకా ఎదురెదురుగావచ్చి మూతులు నాక్కుని ముచ్చటలాడుకుంటూ 'కిచకిచ' మని వెళ్ళిపోవడం చూచాడు శేషగిరి. అది నాంది. ఆ తర్వాత మరిక్రొత్తగా బయట నుండి గృహప్రవేశం చేశాయో, లేకపోతే సినిమా షూటింగు సాగేటట్లు 'శరవేగం'తో వంశవృద్ధి జరిగిందో కాని, శేషగిరి ఇంట్లో ఎలుకల నివాసం మూడు పూవులూ ఆరు కాయలూగా విరాజిల్లింది. ఏతన్మూషిక మహాశయుల ప్రభావం సరోజినమ్మగారి ఉప్పూ పప్పూ మిరపకాయలూ వగైరాలతో ఆగక మెత్తదిండ్లూ, శేషగిరి చొక్కాలూ మొదలయినవాటి మీదకు వ్యాపించ నారంభించింది. ఇన్ని రకాల ఆహారాలను తిని బలిసిన ఎలుకలు, తమ యింట్లోకే సరోజా శేషగిరులు అక్రమంగా ప్రవేశించారన్నట్టుగా స్వైర విహారం సలిపేవి. అసలు శేషగిరి విస్తుపోయేదల్లా "ఈ ఎలుకలు నా భార్యకి భయపడ్డంలేదే! వీటి రక్తనాళాల్లో ద్రవరూపమయిన ధైర్యం ప్రవహిస్తూందేమో!" నని.

ఆరోజు సాయంకాలమే శేషగిరి ఇనుపకమ్ములు అమర్చబడిన ఒక ఎలుకబోను పట్టుకొచ్చి సరోజ ఎదుట పెట్టాడు.

"దీన్ని మాత్రమే తెచ్చేరా?" అన్నది సహధర్మిణి.

"ఏం! ఇంకోబోను పట్రావాలా? ఒక్కటి చాలదూ?"

"అయ్యో రామా! ఎలుకకి తినడానికి ఏదైనా పెడితే కదండీ అది బోనులోకి రావడానికి? వెంటనే వెళ్ళి వెంకటా కేఫ్‌లో ఒక మసాలా గారె పట్టుకురండి."

"ఎలుక మనకేం వియ్యంకుడా వియ్యపురాలా మసాలా గారెతో సత్కరించడానికి?...అందులోనూ వెంకటా కేఫ్ 'గారె' కావాలని 'మెమొరాండం' సమర్పించిందా ఏం...హూం...ఏమీ అక్కర్లేదు. ఇంట్లో ఏదైనా వుంటే పెట్టు. 'తినను' అంటే పళ్లూడదన్ని బయటికి తరుము."

"చాలండీ. ఎవరయినా వింటే నవ్విపోతారూ - అయినా ఇలా ఏదీ తెలియని మొగాళ్లెక్కడయినా వుంటారా? ఉల్లిపాయ వాసనకయితే గాని ఎలుకలు త్వరగా రావండీ..."

ఉల్లిపాయగారె వెంకటా కేఫ్‌లో పెద్ద పళ్లెంనుండి శేషగిరిద్వారా సరోజను చేరింది. దాన్ని సరోజ బోనులోని కమ్మికి తగిలించి 'సుస్వాగతం' అన్న బోర్డు తగిలించడం మినహా అన్నివిధాలా బోను సిద్ధం చేసి వంటింట్లో అలమారమీద వుంచింది.

'బాంబార్డ్‌మెంట్'కి ముందురోజు 'ఫ్రంట్ లైన్'లోని సైనికుడిలా వుంది సరోజ మనసు. ఆ రోజు రాత్రల్లా ఆవిడ జాగరణ చేయడం కాక శేషగిరిని కూడా సరిగా నిద్రపోనీలేదు. "ఏదో చప్పుడు వినపడుతూందండీ! ఎలుక పడినట్లుంది. వెళ్లి చూచిరండీ!" అని శేషగిరిని ప్రతీ అరగంటకోసారి వంటింటివైపు పంపించేది. ఐదారుసార్లు శేషగిరి వెళ్ళిచూచాడు కానీ ఎలుక పడ్డ సూచన లేదు. తమ ప్రయత్నాల ఫలితాన్ని ఎదురుచూచి చూచి దంపతులిద్దరూ మూడు గంటలకల్లా నిద్రపోయారు.

ప్రొద్దున్నే మొదట సరోజ మేల్కొంది. వెంటనే శేషగిరిని లేపింది. ఇద్దరూ కలిసి వంటింట్లోకి వెళ్లి చూచారు. ఆశ్చర్యం! ఎలుకబోను ఎలా వుంచారో అలాగే వుంది. ఎలుక లేదు సరికదా బోనులోపలి గారె కూడా కనపడలేదు. "ఆహా ఎలుకలారా! మీముందు వర్జిల్ సార్కారెందుకూ? మీకివే నా జోహారులు" అన్నాడు శేషగిరి నోరు తెరవకుండానే.

"అసలు...ఆ ఉల్లిపాయగారె ఎక్కడికి పోతుందీ అని? బోనులోకి ఎలుక వచ్చి వున్నట్లయితే గారెమాత్రం తీసుకుని బయటికి ఎలా పోగలదూ?" అంది సరోజ.

ఆవిడ పలుకులు బాగా గమనించితే... "రాత్రి ఐదారుసార్లు వంటింట్లోకి వచ్చి పోయినపుడెల్లా కొద్దికొద్దిగా తానే ఆ గారెను స్వాహా చేసినట్టు ఆమె సందేహపడుతున్నట్టుంది" అని ఊహించిన శేషగిరి "నా కా వెంకటా కేఫ్‌లోని ఫలహారాలేవీ నచ్చవని నీకు తెలుసునుకదా" అందామనుకుని "బహుశా! నీవు గారె సరిగ్గా తగిలించలేదేమో!" అని వూరుకున్నాడు.

నాలుగురోజులిలాగే వరుసగా గారెలు నష్టపడ్డారు దంపతులు. ఎలుకల బోను సరిలేదా, మరి అందులో గారెలు పెట్టడంలో ఏదైనా సూక్ష్మాంశం గమనింపబడటం లేదా...అదీ కాకపోతే ఆ ఎలుకలు, ఎంత ఎత్తున, డేన్లో పెట్టి, ఎలా మూసినా, తినుబండారాలను అతిలాఘవంగా కొట్టేసే తన బావమఱది జగదీశం రకానికి చెందినవా, అన్న సందేహాలు మెరిశాయి శేషు బుర్రలో.

అయినా ఒక్కరోజు జరగనే జరిగింది; నిజంగానే జరిగింది! అవిరళ హర్షానికీ అంతులేని అక్కజానికీ హేతుభూతమయిన ఆ అత్యద్భుత సంఘటన సంభవించింది... ఇదంతా కూడా శేషగిరి ఇంటో ఒక తెలివితక్కువ ఎలుక బోనులో చిక్కకోవడాన్ని తెలుపుతున్నాయని ప్రజలు పెదవి విరవవచ్చు గాని, ఆ దంపతుల కది కేవలం ఒక 'పద్మవిభూషణ' పట్టప్రదానోత్సవంలాంటి సంఘటన!

టప్‌మన్న శబ్దం విని శేషగిరిని సరోజ మేల్కొల్పింది. సంభ్రమాశ్చర్యాలు సమపాళ్ళలో సమ్మిళితమయి ప్రతిఫలిస్తున్న ముఖారవిందంతో భర్తృసమేతంగా వంటింట్లోకి ప్రవేశించింది శ్రీమతి సరోజ.

బోను కమ్ముల సందునుండి 'గురుగురు' మని తన చిన్నకళ్ళతో చూస్తున్న నల్లపిల్ల ఎలుక కనబడింది. తనఇంటి ఎలుకల్లో ఇంత

# ★ మూషికాలూ - శేషగిరీ ★

మూషికములివుండా అని ఎంతో ఆరాట పడ్డాడు, మేధాసంపత్తి ఎక్కువవున్నా అంజలు లర్పించే శేషు.

లంగరులేని నౌకలా ఆనందసాగరంలో కాసేపు అటూ ఇటూ తేలింది సరోజ. 'ఆస్టర్‌లిట్జ్' తర్వాత నెపోలియన్‌లా, 'వాటర్లూ' వెనుక నెల్సన్‌లా '47 ఆగస్టు పదిహేనున భారతీయునిలా, '53 అక్టోబరు ఒకటిని ఆంధ్రునిలా ఫీలయింది సరోజ.

క్షణంలో సంతోషం మాయమయిండి; దానిస్థానే తనింట్లో ఇన్నాళ్లనుండీ అపారమయిన నష్టాన్ని కలుగచేస్తూ వచ్చిన ఆ ఎలుకమీద ఆగ్రహం పుటుకొచ్చింది. "నిన్ను కట్టెల్లో పెట్టా!... మా అమ్మకడుపులో చిచ్చుపుట్టా ... వెధవఎలుకా ... ఇన్నిరోజులనుండి నన్నా మోసగిస్తున్నావ్?... హూ ... ఏం చేస్తానో చూడు నిన్ను" అని హుంకరించి శేషగిరివైపుతిరిగి "ఏమండీ! ముందీబోను తీసికెళ్ళి ఈ వెధవ ఎలుకని వీధి చివర నొదిలిపెట్టెరండి" అని ఆజ్ఞాపించింది.

నిప్పుమీద అడుగిడినవానివలె ఎగిరి దుమికాడు శేషగిరి.

రాత్రి ఒంటిగంట. చీకటి ముసుగుతో నిశ్శబ్దం నగరాన్ని పాలిస్తూంది. అలాంటప్పుడు బయటికిపోవడమే శేషగిరికి ప్రాణాంతికమనిపించేది. అందులోనూ ఇపుడు ఎలుకబోను (ఎలుక లోపలవుండగా) తీసుకుని పోవాలట! వెక్కిరింపుగా ఎలుక బోను తలుపు తెరచుకుని మీదబడితే ... అమ్మయ్యో... "అ...ఇపుడు దీనికేం అవసరంలే? తెల్లవారనీ చూచుకుందాం" అన్నాడు శేషగిరి, తప్పించుకునే ధోరణిలో.

కానీ భైరవి వయునికి వరమీయలేదు.

"చాలబాగుంది మీరు చెప్పడం! ఇపుడే దీన్ని తీసుకువెళ్లి వదిలితే మళ్ళీ పొద్దున లోపుగా మరో ఎలుకను పట్టొచ్చు .... ఈ ఇంట్లో ఎలుకలు దొరకడమే కష్టంగా వున్నపుడు పొద్దునదాకా కాచుకుని కూచుంటారట...ఊ ఇదిగో...వెళ్ళిరండి ......"

"ఇపుడు మళ్లీ బోను పెడితే తెల్లవారే లోపుగా ఒక ఎలుక పడుతుందని ఏం నిశ్చయం?" అన్నాడు శేషగిరి.

"పడదని ఎందుకనుకోవాలి?" అన్నది సరోజ. "అర్ధరాత్రిపూట వృథాగా వింత తర్కాలు చేస్తూ నిలబడకండి. చెప్పినట్టు చేయండి!" అంది. చేయక తప్పిందికాదు శేషగిరి.

ప్రపంచమే ఒక ఎలుకబోనుకాగా, ఈ గోళంమీది "గండక పుండరీక మాతంగ తురంగ మహిష వరాహ గవయగండ సింధుర సింహ శరభాది మృగగణంబు" లన్నీ అబోనులో వున్నట్టుగా శేషగిరి ఆ బోను చేత పట్టుకుని నిష్క్రమించాడు.

"అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ! హే భగవాన్! కౌలతిలకందని వలువలతో ద్రౌపది మానాన్ని ఆరోజు కాపాడేవు; మరోనాడు 'సిరికిం చెప్పక శంఖ చక్ర యుగముం జేదోయి సంధింపక'యే గజేంద్రుణ్ణి రక్షించావు; ఇంకోసారి 'చిదిమిన పాల్గారు పసిడిబుగ్గల' ధ్రువుడికి అండగా నిలిచేవు. ఇవాళ నన్ను నీట ముంచవుకదా?"..."నేను ఆడదానిగా పుట్టి వుండకూడదా? ఎలాటి బాధ్యతా లేకుండా సరోజలా భర్తమీద అధికారం వుండొచ్చు కదా!"...ఇలా ఎన్నెన్నో విధాల ఏమేమో అనుకుంటూ బోను చేతబూనిన శేషు వీధి మలుపు చేరాడు.

అయినా బోను తలుపుతీయడానికి ధైర్యం చాలలేదు. ఇంతసేపట్నుంచీ లోపల అల్లాడుతున్న ఎలుక ఎంత ఉద్రేకంతో వుంటుంది? "వీడేకదా నా స్వాతంత్ర్యాన్ని అరికట్టిన సామ్రాజ్యవాది?" అన్న కోపంకొద్దీ పీకితే-? ఇలా అనుకుంటూ బోనును క్రిందవుంచాడు శేషగిరి. కొంతసేపు అలాగే నిలబడ్డాడు. కాని అర్ధరాత్రిపూట రోడ్డుమీద ఎంతసేపని నిలుస్తాడూ?

ఐదు నిమిషాల తర్వాత - ధైర్యం చిక్కబట్టుకుని, కులదైవాన్ని స్మరించుకుని... బాలచంద్రుడు, శివాజీ, మొదలయినవారి వీరగాథలను అతివేగంగా నెమరువేసుకుని ...నెమ్మదిగా ఎలుకబోను తలుపు తీశాడు శేషగిరి. గభుక్కున ఎలుక బయటపడి పరుగెత్తింది. అదే క్షణంలో శేషగిరి వెనక్కు త్రుళ్ళిపడి ఆ దారివెంబడే వస్తున్న ఒక వ్యక్తిని ఢీకొన్నాడు.

ఎవడో దొంగ అనుకుని శేషగిరి చేతులు రెండిటినీ గట్టిగా పట్టుకుని ఆ చీకటి వ్యక్తి "ఎవరోయ్ ఈ చీకట్లో? ఏం చేస్తున్నావ్ ఇక్కడా? దున్నపోతులా మీదికొచ్చి పడతావేం?" అని గర్జించాడు.

స్వరాన్నిబట్టి ఆ వచ్చినవ్యక్తి చివరియింటి చిదానందం అని తెలుసుకుని శేషగిరి "నే నేనండి! మీ రెక్కడికి వెళ్లొస్తున్నారూ?" అని పల్కరించాడు.

"ఓహో! మీరుటండీ"-అని ఆయన అనగడంతో ఆయన తన్ని గుర్తుపట్టాడని తెలుసుకున్నాడు శేషు. దొంగ అనుకుని చిరునామా అవీ కనుక్కోకుండా పీపు మరమ్మత్తు చేస్తాడేమో అని భయపడ్డ శేషగిరికి ఇది శుభసూచక మనిపించింది.


ప్రమాద రక్షణకు
ప్రశస్తమైనది
భీమా

ఎప్పుడే ప్రమాదం వచ్చేదీ, ఏ క్షణం ఎలా ఉండేదీ తెలియని ఈదినాల్లో
అగ్ని * మోటార్ కార్ * కార్మిక నష్టపరిహారం
నౌక * ఫయడిలిటీ గ్యారంటీ * మొదలైన భీమాలకు
—మాతో సంప్రదించండి;—

యునైటెడ్ ఇండియా ఫైర్ అండ్
జనరల్ ఇన్సురెన్సు కంపెనీ లిమిటెడ్,

"యునైటెడ్ ఇండియా లైఫ్ బిల్డింగ్సు"
ఎస్ప్లనేడ్ - మద్రాసు.

Telephone : 4241. Telegrams : "UNIGEN"

బ్రాంచీలు :
బొంబాయి - కలకత్తా - కొలంబో - సింగపూరు - విజయవాడ -
ఢిల్లీ - పాట్న - లక్నో - బెంగుళూరు - కోయంబత్తూరు.

# ★ మూషికాలూ - శేషగిరి ★

"నేను 'సెకండ్ షో' ప్రభాత్ కి వెళ్ళి వస్తున్నానండీ! ఈ అకాలంలో మీరేమిటి చేస్తున్నారిక్కడ?" అని అడిగారు చిదానందం.

పూసగ్రుచ్చినట్లు శేషగిరి కథంతా వివరించేసరికి చిదానందంగారికి ఆ సందం మాయమయింది. "ఏమండోయ్? ఇదేం పనీ?" అని ఉచ్చస్థాయిలో ప్రశ్నించాడు.

తాను ఎలుకలు పడితే ఈయన కింత కలవర మెందుకో అని బోధపడలేదు శేషగిరికి. "'ఇందేం పని' అని అడుగుతున్నారా. హి-హి-హీ-ఎలుకల వేట. హి హి హి" అన్నాడు శేషగిరి.

"మీరు ఎలుకల వేటయినా ఆడండి; దోమల వేటయినా ఆడండి......దాంతో నాకేమీ సంబంధం లేదు! కానీ మీరు పడుతున్న ఎలుకలన్నిటినీ అర్ధరాత్రిపూట ఈవిధంగా, చడీ చప్పుడూ లేకుండా, నా ఇంటిముందర వదిలిపెట్టడం- ఏం మర్యాదా అని అడుగుతున్నా. ఏమిట్రా నా ఇంట్లో రెణ్ణెల్లనుంచీ ఎలుకల బాధ ఎక్కువయిందే అనుకుంటున్నా నేను. చాల రోజులనుండి మీరు చేస్తున్న పని ఇది అని ఇవాళకదా తెలిసింది——!" అని భూనభోంతరాళాలు ప్రతిధ్వనించేటట్లు కేకలేశారు చిదానందం.

ఆనాడే తమ ఇంట్లో మొట్టమొదట సారిగా, బోనులో ఎలుక పడిందని శేషగిరి శతవిధప్రమాణాలతో చెప్పినా చిదానందంగారు నమ్మలేదు. చేతిలో బోనుతో శేషగిరి వుండగా అతనిమాటల నెలా నమ్మతాడూ?

"ఏమండోయ్! మీకే మహాతెలివుందనుకున్నారుకాబోలు! నేను మంచికి మంచీ చెడుకు చెడూను. దీనికి ప్రతిగా ఏం చేయాలో నాకూ తెలుసండీ - నాకు తెలుసు. ఇకమీద ప్రతిరోజూ పట్టపగలే రోజుకి డజన్ ఎలుకలచొప్పున తీసుకొచ్చి మీ ఇంటిముందర వదిలిపెట్టకపోతే నన్ను మారుపేరుతో పిలవండి!" అని ప్రతిజ్ఞ చేశారు చిదానందం.

అవమానంతో కొంప చేరాడు శేషగిరి. జరిగినదంతా సరోజతో చెప్పగా - అవునూ; మీరుచేసిందీ తప్పేకదూ? వాళ్ళింటిముందర తీసుకెళ్ళి ఎందుకు వదిలిపెట్టారూ, ఇల్లూ వాకిలీలేనిచోట ఊరికవతల వదలాలిగానీ-" అంది. వీధిచివరను వదిలిపెట్టమని చెప్పిన వాలుకకూడ ఈ సరోజదేకదా అని గిరి బుర్ర గిరగిర తిరిగింది!

అటుపిమ్మట పక్షంరోజులకి రెండు ఎలుకలుమాత్రం పట్టుబడ్డాయి. కాని శేషగిరి మాత్రం 'రానున్నది రాకమానద' నేధీమాతో అర్ధరాత్రిపూట ఎలుకల్ని వదిలిపెట్టడానికి నిరాకరించాడు. తెల్లవారింతర్వాత ఎలుకల్ని తీసుకెళ్ళి అరమైలుదూరంలోవున్న హైస్కూలుగ్రౌండ్ మధ్యనున్న 'క్రికెట్ పిచ్' లో వదిలేశేవాడు.

ఒకరోజు శేషగిరికి ఒక ఆలోచన తట్టింది. వెంటనే సరోజతో ఇలాఅన్నాడు. "ఇదిగో! ఇలా చూడు! మనం ఈ బోను తీసుకొచ్చి మాసంరోజులయింది షుమారు. ఇంతవరకూ వేటాడబడిన ఎలుకలు మూడే! ఈరేటులో వ్యవహారం సాగితే 'మూషికరహితమయిన గృహమున్' కన్నుల కానలేము. తెలిసిందా? అందుచేత ... నేను నిన్న కందస్వామికోవిలదగ్గర ఒక క్రొత్తరకపుబోనుచూశాను. దానిలో ఒక 'లీవర్ ఎరేంజిమెంటు' వుంది. లీవర్ అంటే ఏతాంకొయ్యలాటిది. దానికి ఒక కొసను అర్ధచంద్రాకారంగా నూత్నంగా, వాడిగా, చిన్నగా అనేకపళ్ళుంటాయి. ఎలుక ఆ పలకమీదికి రాగానే ఆ అర్ధచంద్రాకారపు పండ్లచక్రం ఎలుక మెడను టక్కుని నొక్కి పట్టేస్తుంది. ఇపుడాగారెలనుమాత్రం - దేవతలు హవిస్సునందుకున్నట్లు - కొట్టేసిపోతున్నాయే ఎలుకలు - ఆబోనులో అలా పోవడానికి అవంతయినా ఆస్కారంలేదు ... ఎలాంటి ఎలుకయినా సరే కిక్కురుమనకుండా వెంటనే చావాల్సిందే ... దాని ప్రాణం మహోవుంటే - 'రామరామ' అని అంత్యస్మరణ చేసుకునే దాక వుండొచ్చునేమో - అంతే...ఎలుక చచ్చితీరుతుంది గనుక శుభ్రంగాతీసి వీధికుప్పతొట్టెలో పారేయొచ్చు. ప్రతీసారీ ప్రాతఃకాలానే, నేను చేతిలో బోనుతో 'పచ్చప్పాస్ గ్రౌండ్' దాక పయనమవాల్సినపనివుండదుకూడా...ఇలా ఓపడిచస్తే మిగతావి ఎక్కడివక్కడ మాయమయిపోతాయి ..ఏం, అలా చూస్తున్నావ్?... అబోనొకటి ఇవాళ సాయంత్రం తీసుకుని రానా?"

"హరిహరీ" అని చెవులు మూసుకుంది ఆ సాధ్వీమణి సరోజ డ్రామాల్లోని పతివ్రతల్లాగా.

"చేస్తున్న పాపాలన్నీ చాలవన్నట్లు జీవహింస వేరే చేతులారా చెయ్యమంటారా, మంచియోచనే!" అంది సరోజ.

పెళ్ళయినరోజునుండి ఆవిడ తన్ను పెడుతున్న బాధ 'జీవహింస' శీర్షిక క్రిందికి రాదు కాబోలు అనుకుని "మరి అలాగంటే ఎలుకలెలా పోతాయీ?" అన్నాడు శేషగిరి.

"అందుకు వేరే ఉపాయం కనిపెట్టానులెండి. రేపట్నుండి పిల్లిపిల్ల నొకదాన్ని పెంచబోతున్నాను" అంది సరోజ ఉత్సాహంగా. 'సరే' అనక - 'వద్దు' అనలేక వూరుకున్నాడు శేషు.


## రత్నపురుషవేహం

బంగారు ర్చబడినది. మేహము, అత్యుష్ణము. నిక్కాక, శుక్లనష్టము. పాలుమాలిక, కాళ్లతీపులు. ఇతర నరములకు సంబంధించిన వ్యాధులు, మూత్రవ్యాధులు మొదలగు వానిని హరించి బలమును, కాంతిని ఇచ్చును రెండుడబ్బాలు చాలును. 20 తు డబ్బా రు. 3-12-0 వి. పి. 1/-

ఇండియన్ మెడిసన్ హౌస్,
లక్ష్మిటాకీసు రోడ్డు-విజయవాడ-2.

## నారసింహ లేహ్యము




బంగారు చేర్చబడినది. మేహము, నిక్కాక, నిస్సత్తువ, శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము——

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 15 అ.
పి. సి. ఎ. &కంపెని. "ఆయుర్వేదసమాజం"
పెరిడేపి- నెల్లూరు జిల్లా.




హిందూ దేశమంతటా దొరకును

మరువటిరోజు ఒక స్నేహితురాలి దగ్గర నుండి ఓ చిన్న గోధుమరంగు పిల్లిపిల్లను తీసుకొచ్చింది. ఆ పిల్లిపిల్లకు రాజోపచారాలు జరిగాయి. “హా! పిల్లిపిల్లా! నీ జన్మ మెంత ధన్యం!” అని అసూయ చెందాడు శేషగిరి.

మాసంరోజులు మళ్ళీ గడిచాయి. మూషిక సంచయపు సంఖ్యాబలానికి ఆరోహణే కాని అవరోహణ లేదు. పిల్లిపిల్లకూడా ‘ఇంతింతై వటు డింతయై’ అని పెరిగింది.

“పిల్లిపిల్ల బాగా పెరిగిందికదా ఇంకా అది ఎలుకలు పట్టదేం?” అన్నాడు భర్త. “పాపం! అది చిన్న బిడ్డండీ, బిడ్డ- పసి కూన! అప్పుడే దానికి కుట్రయుక్తులూ ప్రాణిహింసలూ ఎలా తెలుస్తాయి? ఇంకా




S. 221-X52 TL

ఇండియాలో తయారుచేయబడినది

# ★ మూషికాలూ - శేషగిరీ ★

కనీసం రెండు మాసాలయినా కావాలి." అంది సరోజ.

మళ్లీ ముప్పైరోజుల తర్వాత శేషగిరి ఈ విషయం ప్రస్తావించినపుడు "పిల్లికి ఎలుకలు పట్టడం ఎలాగు అని మనం నేర్పించాలా ఏం? మీరు చెబుతున్నది చాల బాగుందిలెండి. దానికి కుడొస్తే అదే పట్టుకుంటుంది, చూస్తూవుండండి" అని 'జూఆలజీ'లో ఒక పాఠంలా చెప్పింది సరోజ.

కానీ ఎలుకలబాధ తాలూకు 'థర్మామీటరు'లోని పాదరసం మరింత పైకి పోవడం మూలాన్ని - పిల్లి ప్రయత్నాలు అటుంచగా మసాలాగారెతో బోను పెట్టడం మంచిదని శేషగిరి సూచించాడు. సరోజ సరేనన్నది తర్వాత మూడువారాలలో బోనులో ఒక ఎలుక పడింది కాని పిల్లి మాత్రం..

ఒకరోజు రాత్రి నిద్రపోతున్న శేషగిరిని లేపి ఎడమచేతిని ఎడమచెవికి వెనుక ఆనించి కుడిచేతి చూపుడు వేలుతో లోపలివైపు చూపిస్తూ "ఏమండీ! చూశారా! ఆ శబ్దం విన్నారూ వంటింటిలో" అంది సరోజ.

వంటింట్లోనుండి "గడగడా దడబుడా" అని పెద్ద శబ్దాలూ 'మ్యావ్ మ్యావ్'మన్న పిల్లి కేచుగొంతూ వినపడుతున్నాయి

"ఈ భూకంపమంతా ఏమిటంటావూ?" అన్నాడు శేషగిరి

"నే ననే చెప్పింది" పిల్లి ఎలుకను పట్టుతూంది.. ఇది కూడా తెలీలేదుటండీ?"

"ఉరుములూ పిడుగులూ గావున్న ఈ వాతావరణంలో - ఇంత రణగొణధ్వని చేస్తూనా పిల్లి ఎలుకను పట్టడం?" అన్నాడు.

"చాలు చాలు! అన్నీ తెలిసినట్టు మాటాడకండి. కావాలంటే వెళ్లి చూద్దాం రండి."

ఇద్దరూ వంటింటిలోకి వెళ్ళారు; శేషగిరి లైటు స్విచ్ నొక్కాడు శేషగిరి కంటికింపూ - సరోజకి కంటకింపూ గా వున్నదృశ్యం కనపడింది

సరోజ ముద్దుపిల్లి మొద్దుతల ఆ పెద్ద బోనులో చిక్కుకునివుంది. బోను తలుపు పిల్లి మెడను నొక్కి పట్టగా ఏతిప్పినన విముక్తికై పోరాడుతూ-పంచమ స్థాయిలో భీషణ ఘోషణలు సలుపుతూ ఆ మార్జాల కిశోరం ఇటూ అటూ తిరుగుతున్నది.

"పాపం! దీనికికూడా 'వెంకటాశేష' మసాలాగారెలంటే ఇష్టమల్లేవుందే!" అని గొణిగాడు శేషగిరి

సరోజ వెళ్ళి పిల్లితలను బోనులోనుండి విడిపించి దానిని రొమ్ముకు హత్తుకుని దాని మెడ దువ్వుతూ ఎత్తుకొచ్చింది శేషగిరి దాని మెడకేసి చూస్తూ "పెద్దగాయమేమీ తగలలేదుకదా పాపం" అన్నాడు జాలిగా.

కొంత, పరుషంగా సరోజ అంది "మీ వేళాకోళాలకి సమయం లేదూ? .. నే నింక ఈ ఇంట్లో వుండలేను; ఈ ఎలుకలబాధ పడలేను. చెప్పాస్తున్న ముందు మరో ఇల్లు చూడండి"

"ఏమిటీ.. మరో ఇల్లా?"

"ఔను! మరో ఇల్లు—మనం కాపురం వుండడానికి చూడమంటున్నాను"

"అబ్బే ఈ మద్రాసులో అద్దె కొంపలన్నీ ఇంచుమించు ఇంతే సరోజా!"

"అయినా ఇలా ఎలుకల బాధవుండదు."

"ఎలుకలు లేకపోతే నల్లులుంటాయి"

"నల్లులుంటే డి డి టి కొడదాంలెండి!"

"ఎలుకలు కాకపోతే దోమలుంటాయి"

"అబ్బబ్బ—దోమలుంటే దోమతెరలు వేసుకుందాం కాని శ్రీకారంలో నే హంస పాదు పెట్టక ముందర చొక్కా వేసుకుని వెళ్లేవు.."

"ఆ ఆ ఇప్పుడు చొక్కా వేసుకోవడమూ...గంటెంతనుకుంటున్నావ్?"


హాల్లోని 'వాల్ క్లాక్', 'సా—శ్రీ' అని పలికి వూరుకుంది ★


## నపుంసక తైలం

అంగపరిములు బలహీనత చెంది చిన్నదైన తిరిగి యధాప్రకారం పై ప్రాప్తి సౌఖ్యమును అనుభవించుటకు 48ఏండ్లు ప్రఖ్యాతి చెందిన గ్యారంటీ మందు 1 సీసా రూ 10/-లు. వి పి రూ 1-4-0

కావలసినవారు రు 1/4 ముందుగా పంపేది.

డా॥ రత్నం సన్సు మెడికల్ హాల్,
మలక్ పేటబిల్డింగ్స్, హైదరాబాదు-(దక్కన్)

కొబ్బరితోట